ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
3★★★
సోమవారం 3 ఫిబ్రవరి 2025



ప్రజల అవసరాల మేరకే ఇసుక టోకెన్లు జారీ

● తహసీల్దార్ ఎంఏ ఫారూక్



ఆంధ్రజ్యోతి : బిక్కవాగు నుంచి ఇసుక టోకెన్లను ఏ ప్రాతిపదికన జారీ చేస్తున్నారు ?

తహసీల్దార్ : మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్ల పర్మిషన్ కాపీల ఆధారంగా ఇసుక టోకెన్లు జారీ చేస్తున్నాం. అక్రమాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి ?

తహసీల్దార్ : ఇసుక టోకెన్లు జారీ చేసిన సమయంలోనే ఇసుకను తరలించాలని సూచించాం. పోలీస్ శాఖ సహకారంతో పటిష్టమైన నిఘా కొనసాగుతోంది. ఇటీవలే తిప్పాపూర్ సమీపంలో ఇసుక డంప్‌ను పట్టుకున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

తహసీల్దార్ : మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలు సేకరించి సర్వేలు జరిపిస్తున్నాం. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి.

ఆంధ్రజ్యోతి : చిక్కుడువాని పల్లె గ్రామంలో చౌకదరల దుకాణం ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

తహసీల్దార్ : చిక్కుడువానిపల్లె గ్రామంలో చౌకధరల దుకాణం ఏర్పాటు కోసం మరోసారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

- ఇల్లంతకుంట

ముహూర్తాలకు వేళాయె..



● మాఘమాసంలో మోగనున్న పెళ్లి భాజాలు
● మే 23 వరకు శుభఘడియలు ● కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు
● ముందస్తుగా కల్యాణ మండపాలు బుకింగ్
● ఫంక్షన్ హాల్స్ నుంచి భోజనాల వరకు అన్నీ ప్యాకేజీలే
● ఎట్రాక్షన్ కోసం పాత కాలపు సాంప్రదాయాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మాఘమాసంలో పెళ్లి ముహూర్తాలు ఆదివారం నుంచి మొదలయ్యాయి. ఎవరిని కదిలించినా మాఘమాసం పెళ్లి ముహూర్తాల్లోనే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మే 23 వరకు ముహూర్తాలు ఉన్నాయి. మళ్లీ మే 28న జ్యేష్ఠ మాసం ప్రారంభం అవుతుంది. దీంతో జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. వీటి కోసం ఇప్పటికే ఫంక్షన్‌హాళ్ల నుంచి మొదలుకొని క్యాటరింగ్, పెళ్లి మండపాలు, బ్యాండ్ మేళాలు, పురోహితుల వరకు బుకింగ్‌లు జరిగిపోతున్నాయి. ఆభరణాలు, బట్టల దుకాణాల్లో పెళ్లిసందడి మొదలైంది. మరోవైపు హంగామా... ఆర్భాటాలు... మూడుముళ్ల బంధం మూడు తరాలు చెప్పుకునే విధంగా ఖర్చుకు వెనుకాడడం లేదు. ఎట్రాక్షన్ కోసం పాత కాలపు సంప్రదాయాలను చూపుతున్నారు.

ప్రత్యేకతను చాటుకోవడానికి వివాహ వేడుకల్లో కొత్తకొత్త అంశాలు చేరుస్తున్నారు. వెడ్డింగ్ కార్డు నుంచి భోజనాల ప్లేట్ల వరకు ఏకోఫ్రెండ్లీని జత చేస్తున్నారు. ఇక భారీ సెట్టింగ్‌లు... డ్యాన్స్‌లు.... సంగీతం... అతిథులకు పోటీలు.... పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు పెళ్లిని ఆరురోజుల పాటు జరిపించేవారు. ఇప్పుడు అర రోజుకు పరిమితం చేశారు. ఆకాశమంత పందిరి వేసి పెళ్లికొడుకు బంధువులు ఇరువురు ఒకేచోట ఏదో ఒక ఫంక్షన్ హాల్‌లో పెళ్లిళ్లను మాత్రం అరరోజులోనే పూర్తి చేస్తున్నారు. గతంలో పెళ్లి ఉందంటే బంధుమిత్రులందరూ కలిసి వారం రోజుల పాటు ఇంట్లో సందడి చేస్తూ అందరు కలిసి వంటలు చేయడం వంట వాళ్లు వస్తే వారికి సహాయం చేయడం జరిగేది. కానీ ఇప్పుడు అంతా క్యాటరింగ్ పద్ధతే వచ్చింది.

ముహూర్తాల మాఘమాసం...

మాఘమాసం ముహూర్తాల మాసంగా చెప్పుకోవచ్చు. చంద్రమానం ప్రకారం 11వ మాసంగా మాఘమాసం మొదలవుతుంది. కార్తీకమాసంలో దీపారాధాన ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మాఘమాసంలో స్నానాలకు అంత ప్రాధాన్యం ఉంటుంది. సూర్యభగవానుడికి పూజలు చేయడం విశిష్టమైంది. అంతే కాకుండా మాఘమాసంలో రథసప్తమి, శ్రీపంచమి, వరుణ షష్ఠి, భీష్మాష్టమి, భీష్మా ఏకాదశి, పూర్ణిమతో పాటు పలు దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వధూవరుల జన్మ నక్షత్రబలం ఆధారంగా ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నాయి.

ఫిబ్రవరిలో 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23

మార్చిలో 1, 2, 6, 7, 12, 14, 15, 16,
ఏప్రిల్‌లో 9, 10, 11, 12, 13, 16, 18, 20, 23 (29, 30, వైశాఖం)

మేలో 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 23 (28 జ్యేష్ఠమాసం) తేదీలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

స్టేటస్ సింబల్‌గా వేడుకలు

సాంప్రదాయబద్ధంగా సాగిపోయే పెళ్లివేడుక స్టేటస్‌కు సింబల్‌గా మారింది. పెళ్లి కూడా ఒక వ్యాపారంలో భాగంగా సంతరించుకుంది. పెళ్లి కూతురు ధరించే దుస్తుల దగ్గర నుంచి ఆమెను అత్తవారింటికి పంపే వరకు, పెళ్లి కొడుకుకు కావాల్సిన వస్తువులను, మండపం అలంకరణలను ఇలా ప్రతీ ఒక్కటి చేసి పెట్టడానికి ఎన్నో సంస్థలు వచ్చాయి. ఇప్పుడు ఒక పెళ్లి ఖర్చు రూ. 20 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు కూడా అవుతోంది. పెళ్లి పనులు చేసి పెట్టేందుకు మనుషులు రెడిమేడ్‌గా లభిస్తున్నారు. చివరకు పెళ్లి కూతురు బంధువులు పట్టుకురావాల్సిన పెళ్లి వస్తువులు కూడా రెడిమేడ్‌గా వచ్చే అమ్మాయిలే రకరకాల వస్త్రాలు ధరించి మోసుకెళ్లడం జరుగుతుంది.

పల్లకీలు, గుర్రపు బగ్గీలు...

పాతకాలంలో పెళ్లి కూతురును పల్లకిలో, పెళ్లి కొడుకును గుర్రంపైన ఊరేగించే వారు. మధ్య కాలంలో అవి అంతరించిపోయాయి. ప్రస్తుతం పెళ్లిల్లో ప్రత్యేకతగా ఉండడం కోసం మళ్లీ పల్లకిల్లో పెళ్లి కూతురును, గుర్రం బగ్గిల్లో పెళ్లి కొడుకు, పాత కాలపు జీబు, కార్లను మళ్లీ ఉపయోగంలోకి తీసుకువస్తున్నారు. మరి కొందరు కేరళ, గుజరాతీ పద్ధతులను కూడా ఉపయోగిస్తున్నారు. కేరళ వాయిద్యం, అక్కడి నృత్యాలు, మార్వాడి వేషాధారణలతో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ప్యాకేజీలతోనే పెళ్లిళ్లు...

పెళ్లంటే బోలెడన్ని పనులు.. బంధువులు ఉండడానికి ఏర్పాట్లతో తలమునకలు.. భోజనాలు...

మిగతా 6లో

సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం

● నీటికోసం ఎదురుచూసే రోజులు పోయాయి
● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

5



ఫాజుల్‌నగర్ చెరువు నుంచి దిగువకు విడుదలవుతున్న ఎల్లంపల్లి నీరు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● రాజన్నను దర్శించుకున్న 40 వేల మంది

5

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు



ఇల్లంతకుంటలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతన నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాణ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇల్లంతకుంటలో అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించాలని భావించిన భక్తులు విరాళాలు సేకరించారు. ఈదుల రవీందర్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి మూడు గుంటల స్థలాన్ని ఇచ్చారు. ఆలయ నిర్మాణం పూర్తికావడంతో శ్రీకాలంపూడి ఆదిశంకర మఠానికి చెందిన ఉన్నికృష్ణన్ నంబూద్రి, ముస్తాబాద్‌కు చెందిన రాజు గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమ వివరాలను అయ్యప్పస్వాములు వివరించారు. సోమవారం గణపతి హోమం, అంకుర పూజ, గోమాత పూజ, స్థలదోశ పరిహారం, విగ్రహ పరిగ్రహం, 4న వాస్తు హోమం, మహాహారతి, కులదోష పూజ, భజన కార్యక్రమాలు ఉంటాయి. 5న గాయత్రి హోమం, ధ్వజ వాహన పరిగ్రహం, ధ్వజ వాహన జలాధివాసం, 6న జలోద్ధారం, బింబి శుద్ధి, నేత్రోనీలనం, ప్రతిష్ఠ కళశ, 108 కళశాలతో స్థాపన, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి. 7న అయ్యప్పస్వామి ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం, పడి ప్రతిష్ఠ, పడిపూజ, శరణుగోశ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు గురుస్వాములు ఎర్రోజు గోపాలచారి, బిల్ల రఘు, ఈదుల రవీందర్‌రెడ్డి, చక్రాదర్‌రెడ్డి, ముంజ భూపతి, కట్ట ఎల్లారెడ్డి, సత్యం తదితరులు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్ష స్థానానికి నామినేషన్లు



ఎన్నికల పరిశీలకుడు సుభాష్, ఎన్నికల అధికారి గోపు బాలరాజుకు నామినేషన్లు అందజేస్తున్న నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్ష స్థానానికి ఆదివారం నాడు నామినేషన్లు స్వీకరించారు. వేములవాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకుడు సుభాష్, ఎన్నికల అధికారి గోపు బాలరాజుకు పలువురు ఆశావాహులు తమ నామినేషన్లను అందజేశారు. అధ్యక్ష స్థానానికి ఎర్రం మహేశ్, రేగుల మల్లికార్జున్, రెడ్డబోయిన గోపి, కుమ్మరి శంకర్, అల్లాడి రమేశ్, శీలం రాజు, కరెండ్ల మధుకర్ అధ్యక్ష స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల స్థానానికి జిల్లా నుండి పండుగ మాధవి, వేములవాడకు చెందిన కోలే కృష్ణ స్వామి నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా అధ్యక్ష పదవికి ఏడుగురు నామినేషన్ దాఖలు చేయడంతో వీరి మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. రెండు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల స్థానాల కోసం రెండే నామినేషన్లు రావడంతో వీరి ఎన్నిక దాదాపుగా ఖరారు అయింది. నామినేషన్లను రాష్ట్ర శాఖ బాధ్యులకు పంపించినట్లు ఎన్నికల పరిశీలకుడు సుభాష్, ఎన్నికల అధికారి గోపు బాలరాజు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సీఐటీయూ ధర్నా



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యో తి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించి న కేంద్ర బడ్జెట్ కార్మిక, రైతు ప్రజలకు వ్యతిరేకంగా ఉందని దీనిని సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అదివారం సీఐటీయూ జిల్లా కమిటీ అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ ప్లకార్డులతో నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గత బడ్జెట్ కంటే సుమారు మూడు లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయిం చినా జీడీపీలోటు 4.4శాతం చూపడం అర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన 10 సంవత్సరాల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యం అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని బీజేపీ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని ఆరోపించారు. రైతు రుణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధిహామీ పథకానికి నిధుల పెంపును విస్మరించిందన్నారు.

విద్యుత్ రంగం సంస్కరణలు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్రహాని కలుగుతుందని వాపోయారు. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వంద శాతానికి పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, సిరిమల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



గంభీరావుపేట-లింగన్నపేట మధ్య రోడ్డు కాజ్‌వేపై ఏర్పడిన గుంత

గంభీరావుపేట నుంచి లింగన్నపేట వెళ్లే ప్రధాన రహదారిపై చిన్న కాజువే ఓ వైపు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు అక్కడ ఓ కర్రను హెచ్చరిక స్టాండ్‌గా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాలు ఎక్కువగానే తిరుగుతుంటాయి. వచ్చి వెళ్లే వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే కాజువేపై ఏర్పడిన గుంతను పూడ్చాలని ప్రజలు కోరారు.

- గంభీరావుపేట

హడలెత్తిస్తున్న చోరీలు

- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం
- వరుస దొంగతనాలతో జనం బెంబేలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, రాజన్నపేట, బొప్పాపూర్, అల్మాస్‌పూర్, నారాయణపూర్, కోరుట్లపేట, సింగారం తదితర గ్రామాల్లో కొన్ని నెలలుగా వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్న తీరుతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అత్యవసరంగా గడప దాటి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో పల్లెల్లో దొంగల సంచారం అధికమైంది. పగలంతా సాధారణ వ్యక్తుల్లా పలు కాలనీల్లో రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లపై దృష్టిపెడుతున్నారు. గ్రామం నిద్రపోతున్న సమయంలో గుట్టుగా ఇళ్లలోకి ప్రవేశించి దర్జాగా దోచుకుపోతున్నారు. ఆలయాలను వదలడం లేదు. తాళాలు పగులగొట్టి హుండీలను ధ్వంసం చేస్తున్నారు. ఆలయాల్లోని ఉత్సవమూర్తుల ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళుతున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు

- మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన రాయవేని సురేందర్ గత యేడాది నవంబరు 24న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మరో ఊరికి వెళ్లాడు. దొంగలు తాళం పగులకొట్టి ఇంటిలోని బీరువాలో దాచి ఉంచిన రూ.80 వేల నగదుతో పాటు 20 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

- అల్మాస్‌పూర్ గ్రామంలోని లిక్కిడి పద్మ, ఉచ్చిడి కిషన్‌రెడ్డిలు గత యేడాది డిసెంబరు 2న తమ ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. పద్మ ఇంటి తాళం పగులకొట్టిన దొంగలు లోనికి చొరబడి రూ.15 వేల నగదును, ఉచ్చిడి కిషన్‌రెడ్డి ఇంట్లో ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, గడియారాలను అపహరించుకుపోయారు.

- ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన సయ్యద్ జావిద్ జనవరి 22న తన ద్విచక్రవాహనాన్ని గొల్లపల్లి శివారులోని ఓ వైన్స్ షాపు ఎదుట నిలిపాడు. మద్యం కొనుగోలు చేసుకుని వచ్చేసరికి దొంగలు బైక్‌తో పాటు బైక్ పెట్రోల్ ట్యాంకు కవరులో ఉన్న రూ.84వేల నగదును ఎత్తుకెళ్లారు.





ఇంటిలో దొంగలు ధ్వంసం చేసిన బీరువా(ఫైల్), చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు(ఫైల్)

● పోలీసులు అవగాహన కల్పిస్తున్నా..

మండలంలోని అన్ని గ్రామాల్లో దొంగతనాల నివారణకు పోలీసుశాఖ అవగాహన కల్పిస్తున్నారు. అయినా ప్రజలు జాగ్రత్తలు పాటించడం లేదు. కష్టపడి సంపాదించిన నగదు, నగలను ఇంట్లో బీరువా లాకర్‌లో ఉంచితే భద్రంగా ఉంటుందని భ్రమపడుతున్నారు. చోరీలను అరికట్టేందుకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ప్రజలు తమ ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళితే సమాచారం అందించాలని పోలీసులు సూచించినా పెడచెవిన పెడుతున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు.

రాత్రి వేళలో గస్తీ ముమ్మరం..

- రమాకాంత్, ఎస్ఐ



మండలంలోని అన్ని గ్రామాల్లో దొంగల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. రాత్రివేళలో గస్తీని ముమ్మరం చేశాం. దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామాలకు వెళితే మాకు సమాచారం అందిస్తే ఆ ఇళ్లపై నిఘా ఉంచుతాం.

మహిళా కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలుగా స్వరూప



నియామకపత్రాన్ని అందుకుంటున్న స్వరూప

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ మహిళా అధ్యక్షురాలిగా రెండోసారి పట్టణానికి చెందిన వెలుముల స్వరూపతిరుపతిరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు చేతుల మీదుగా కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ మహిళ అధ్యక్షురా లిగా నియమకపు పత్రాన్ని వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదరిగా కోడం అరుణకు నియామక పత్రాలను అందించి అభినందించారు.

ఈ సందర్భంగా స్వరూపతి రుపతిరెడ్డి, కోడం అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయ డానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన మంత్రులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనితనళినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


వెంకటసాయి (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన మచ్చ రాజ్‌కుమార్ పెద్ద కుమారుడైన మచ్చ వెంకటసాయి(11) ఆదివారం ఐదుగురు స్నేహితులతో కలిసి గ్రామంలోని అంకుశానికుంట వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అక్కడ స్నేహితులు ఈత నేర్చుకుందామనగా కుంటలోకి దిగారు. ఈత రాకపోవడంతో వెంకటసాయి కుంటలోని ఓగుంతలో మునిగిపోయాడు. మిగతా స్నేహితులు భయంతో గ్రామస్థులకు తెలపగా, సంఘటన స్థలానికి చేరుకొని గుంతలో ఇరుకున్న బాలుడిని బయటకు తీయగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెడికో ఆర్పిసాహు మృతదేహానికి పోస్టుమార్టం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని ప్రతిమ మెడికల్ కళాశాల హాస్టల్‌లో పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మృతిచెందిన మెడికో ఆర్పిసాహు మృతదేహానికి ఆదివారం ఉదయం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తోటి పీజీ విద్యార్థి కారణంగానే ఆర్పిసాహు ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానం ఉన్నట్లు మృతురాలి తండ్రి రాజేంద్రసాహు ఇచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఆర్పిసాహుతో తోటి పీజీ డాక్టర్‌కు 2నెలల నుంచి విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఆమె చెంపపై కొట్టడం, విందుకు ఎందుకు రాలేదని కోప్పడడం వంటివి ఇద్దరిమధ్య బలమైన స్నేహం ఉండేదని తెలుస్తోంది. గతనెల 29నసదరు డాక్టరు ఇంటికి మృతురాలు ఒంటరిగా వెళ్లి వచ్చిన తరువాత హాస్టల్‌గదిలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించడం, చికిత్స పొందుతూ మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆ డాక్టరు తనను మాటిమాటికి కోప్పడుతున్నాడని మృతురాలు తన సోదరికి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలకు కారణమైన ఇద్దరు వ్యక్తులపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామశివారుతో పాటు వెంకటాపూర్ గ్రామాల్లో ఇటీవల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలకు కారణమైన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని వెంకటాపూర్ గ్రామం మూలమలుపు వద్ద గత నెల 24న బైక్‌పై వెళుతున్న ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన ఎలుసాని సురేశ్, నర్సయ్యలను ఇసుకను తరలిస్తున్న బొప్పాపూర్‌లోని ట్రాక్టర్ డ్రైవర్ బత్తుల సింహాద్రి ఢీకొట్టాడు. మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఈ నెల 2న ఎల్లారెడ్డిపేటలో నివాసం ఉంటున్న సింగారం గ్రామానికి చెందిన వ్యక్తి వెంకట్రాజం గొల్లపల్లి వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నాడు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లోని ఆటో డ్రైవర్ మహ్మద్ మక్బూర్ అతివేగంగా వాహనం నడపడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకట్రాజం తీవ్ర గాయాలపాలయ్యాడు, బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సింహాద్రి, ఆటో డ్రైవర్ మక్బూర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గరంగరంగా ఎమ్మెల్సీ రాజకీయాలు

- రంగంలోకి బీఆర్ఎస్
- ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణను ప్రకటించే అవకాశం
- అధిష్ఠానం ప్రకటన కోసం పలువురి ఎదురు చూపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల రాజకీయాలు కీలక మలుపు తిరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలో ఉండేది లేనిది ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. అధికార కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా కొందరు ప్రచారం చేసుకుంటూ ఓటర్ల నమోదు కార్యక్రమంలో నాలుగు నెలలపాటు నిమగ్నమై ఉండి క్షేత్రస్థాయిలో పలు సమావేశాలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌లో ఆ ఊసే లేకుండా పోయింది.

ఆ పార్టీ అధిష్ఠానం ఎలాంటి సంకేతాలు, ప్రకటనలు లేక పోవడంతో పార్టీ అభ్యర్థిని పోటీలో నిలపడం లేదనే అందరూ భావిస్తూ వచ్చారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉంటానని, పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంటే తాను స్వతంత్రుడిగా పోటీ చేస్తానని ప్రకటించి కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.

- అగ్రనేతలతో హరికృష్ణ భేటి

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. కాంగ్రెస్ అధికారికంగా తన అభ్యర్థిని ప్రకటించగానే బీఆర్ఎస్ అధిష్ఠానం వేగంగా పావులు కదపడం ప్రారంభించింది. కాంగ్రెస్ టికెట్‌ను అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఆశిస్తూ వచ్చారు. నరేందర్ రెడ్డికే కాంగ్రెస్ అవకాశం కల్పించడంతో బీఆర్ఎస్ దృష్టి ప్రసన్న హరికృష్ణ వైపు మళ్లింది. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగ పడిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిస్తే బాగుంటుందని ఆ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు, మాజీ మంత్రి హరీష్‌రావుతో భేటీ అయ్యారు.


ప్రసన్న హరికృష్ణ

తనకు అవకాశం కల్పిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తానని ప్రతిపాదించారని, అదే ఆలోచనతో ఉన్న బీఆర్ఎస్ నేతలు కూడా ఆయనకు సూత్రప్రాయంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. కేటీఆర్, హరీష్‌రావు ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి ఆదివారం తీసుకెళ్లారని, సోమవారం ఉదయానికి కేసీఆర్ తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముందని తెలిసింది. కాంగ్రెస్‌నుంచి నరేందర్ రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి అభ్యర్థులుగా బరిలో ఉంటున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన హరికృష్ణను పోటీలో నిలిపితే తమకు కలిసి వచ్చే అవకాశమున్నదని బీఆర్ఎస్ అధినేత భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రసన్న హరికృష్ణకు పట్టభద్రుల్లో, విద్యావంతులతో ఉన్న సంబంధాలు ఇటు బీఆర్ఎస్ బలం, బలగం తోడై ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవచ్చని ఆలోచిస్తున్నట్లు సమాచారం. సోమవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా అదే సమయానికి బీఆర్ఎస్ అభ్యర్థి కూడా అధికారికంగా ఖరారవుతారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

బరిలోనే ఉంటానంటున్న రవీందర్‌సింగ్

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వెన్నంటి ఉంటూ వస్తున్న కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ తనను అభ్యర్థిగా నిలుపుతుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. నాలుగు నెలలుగా ఓటర్ల నమోదు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. అనూహ్యంగా రెండురోజుల్లో మారిన రాజకీయాలు ఆయనకు మింగుడుపడడం లేదని చెబుతున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణకు బీఆర్ఎస్ అవకాశం కల్పిస్తే తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ చేయడం విరమించుకోబోనని తేల్చి చెప్పారు. బరిలోనే ఉండి తీరుతానని స్పష్టం చేశారు.

ఉద్యమకారుడిగానే కాకుండా పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా తాను గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టికెట్ అడిగానని, అప్పుడు కూడా పార్టీ మొండి చేయి చూపించింద న్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి వస్తే తాను స్వతంత్రుడిగా పోటీలో ఉంటానని ఆయన చెబుతున్నారు. బీఆర్ఎస్ కే చెందిన ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు కూడా బీఆర్ఎస్ అభ్యర్థిత్వాన్ని ఆశించా రు. బీఆర్ఎస్ నుంచి పోటీచేసే విషయంలో ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో స్వతంత్రుడిగా పోటీలో ఉంటున్నట్లుగా ఆయన ఇదివరకే ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచే పోటీచేయాలని ఐఎంఎ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు కూడా కేసీఆర్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కథలాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలి కోటకు చెందిన లక్కం పెద్దరాజం (47) అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఖర్చులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం రెండు సంవత్సరాల కిందట పెద్ద గంగారాం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆసుపత్రిలో చికిత్సకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో మనస్థాపంచెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆదివారం ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కారు దగ్ధం

జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దరూర్ క్యాంపు సమీపంలో రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేసి ఉన్న ఓ కారు ఆదివారం పాక్షికంగా దగ్ధమైనట్లు కాలనీ వాసులు తెలిపారు. ఆకస్మికంగా కారు నుంచి మంటలు వస్తుండడం గమనించిన స్థానికులు వెంటనే నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. కాలనీకి చెందిన వినయ్ అనే వాహన యజమాని కారును పార్క్ చేసిన తర్వాత కొద్దిసేపటికే కారులో నుంచి మంటలు రావడం గమనించామని తెలి పారు. గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారా లేక మరేదైనా కారణం ఉంటుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన జరిపారు. సంఘటనకు గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు


చిన్నారి కాలిపై గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో కోతులదాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. చిన్నారి శ్రీలేఖ్య ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కోతులు అకస్మాత్తుగా దాడి చేశాయి. గమనించిన తల్లి దండ్రులు వచ్చి చెదరగొట్టారు. చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

భారత మహిళా ఖోఖో కోచ్‌కు సన్మానం


కోచ్ నరేష్ నాయక్‌ను సన్మానిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్

ధర్మారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖోఖోలో భారత మహిళా జట్టు ప్రపంచకప్ సాధించడంలో కీలకపాత్ర పోషించిన కోచ్ ఇస్లావత్ నరేష్ నాయక్‌ను బంజార ఎంప్లాయిస్ యూనియన్ ఆదివారం సన్మానించింది. నరేష్ నాయక్ స్వగ్రామం మండలంలోని లంబాడితండా(బి)కి వచ్చిన సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నున్సావత్ మోతిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి బధావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో పత్తిపాక ఎక్స్‌రోడ్ నుంచి లంబాడితండా(బి) వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామా నికి చెందిన నరేష్‌నాయక్ ప్రపంచస్థాయిలో కోచ్‌గా రాణిస్తుండడం గర్వకారణమన్నారు.

ఉపాధ్య క్షుడు శంకర్‌నాయక్, బానోత్ రాము నాయక్, ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్, ప్రకాశ్ నాయక్, ప్రవీణ్, రవి నాయక్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, రాజు నాయక్, నరహరి నాయక్, ఇస్లావత్ రాజు నాయక్, తది తరులు పాల్గొ న్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు


సిరిసిల్ల శివారులోని ఇటుకబట్టీలో ఉన్న కలప

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలంటూ గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. లక్షలాది రూపాయలు ఖర్చులు చేసి మొక్కలు నాటించి వాటిని సంరక్షించడంతో చెట్లుగా ఎదిగాయి. ఇదే అదునుగా భావించిన స్మగ్లర్లు ఆ చెట్లను నరికివేసి సొమ్ము చేసుకుంటున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్, పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల గ్రామాల శివారులో ఉన్న గుట్టలతో పాటు చిన్నపాటి అటవీ ప్రాంతాలు ఉండగా, గతంలో అటవీశాఖ అధి కారులు హరితహారం కార్యక్రమంలో వేలాది మొక్కలను నాటి సంరక్షించి చెట్లుగా పెంచారు. పెరిగిన చెట్లను అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్మగ్లర్లు ఆ చెట్లపై కన్నేసి నరికేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అరు వ్యక్తులు రాత్రి పూట చెట్లను నరికి వేసి పోద్దంత చెట్ల కొమ్మలను నరికి వేసి రాత్రిపూట సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న సామిల్‌లతోపాటు ఇటుక బట్టీలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇందతా అటవీశాఖ అధికారుల కన్నుసన్నల్లో జరుగుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి చెట్ల నరికివేతపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

ఇటుకబట్టీలు, సామిల్లకు తరలింపు

- పసుల ఎల్లారెడ్డి, చంద్రంపేట



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల శివారులో ఉన్న చెట్లను నరికివేసి చంద్రంపేట శివారులో ఏర్పాటు చేసిన ఇటుకబట్టీలతో పాటు సైజింగ్‌లు, సామిల్లకు తరలిస్తున్నా అట వీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి.

చెట్ల నరికివేతను అరికట్టాలి

- మంగ కిరణ్‌కుమార్, పెద్దూర్



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో ఉన్న ఎద్దు గుట్టతోపాటు అటవీ ప్రాంతంలో నిత్యం స్మగ్లర్లు చెట్లను నరికివేస్తూ రాత్రిపూట ట్రాక్టర్లలో గ్రామంలో నుంచి తరలిస్తున్నా అటవీశాఖ అధికారు లు పట్టించుకోవడం లేదు. దీనిపై సంబంధిత అధికారు లకు ఫిర్యాదులు చేసినా ఎవరు పట్టించుకో కపోవడంతో స్మగ్గర్లు రెచ్చిపోతున్నారు. కలెక్టర్ స్పందించి చెట్లను నరికివేతలను అరికట్టాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన వెంకట్రాజం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని సింగారం గ్రామానికి చెందిన వెంకట్రాజం అనే వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ఆసుపత్రికి తరలిం చారు. వెంకట్రాజం గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు నడుచు కుంటూ వస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టి బోల్తా పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

బొమ్మకల్‌లో యువకుడి దారుణ హత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 2(అంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన బెజ్జంకి మహేష్(22) ఆదివారం రాత్రి గ్రామంలో దారుణహత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని పట్టుకున్నందుకు ప్రతీకారంగా నిందితుడు హత్యచేసినట్లు బొమ్మకల్ గ్రామస్థులు తెలిపారు. బొమ్మకల్ గ్రామ పంచాయతీ భవనం వద్ద ఉన్న మహేష్‌ను రాత్రి సమయంలో దొరకబట్టి బీరుసీసాతో గొంతుకోసి హత్య చేశాడు. అదే గ్రామానికి చెందిన సతీష్ ఈ దారుణానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కరీంనగర్ రూరల్‌సీఐ ప్రదీప్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహేష్ మృత దేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 15రోజుల కిందట జరిగిన ఘటనకు ప్రతీకారంగా ఈహత్య చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు


జూపాక నుంచి కందుగుల వెళ్లే రోడ్డు

- తరుచూ రోడ్డు ప్రమాదాలు
- రోడ్లను విస్తరించాలంటున్న ప్రజలు

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎడ్ల బండ్లు, సైకిల్‌తో గ్రామీ ణ ప్రాంత ప్రజలు సింగిల్ రోడ్లపై రాకపోకలు సాగించేవారు. అప్పటి రాకపోకలకు ఆ రోడ్లు సరిపోయేవి. పరిస్థితులు మారాయి. జనాభా పెరిగింది. ఫలితంగా ప్రతి గ్రామంలో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల సంఖ్య పెరిగిపోయింది.పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా సింగిల్ రోడ్లు.. డబుల్ రోడ్లుగా మారకపోవడంతో మండల వ్యాప్తంగా తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రోడ్డుకు ఆనుకొని పొలాలు

ఆయా గ్రామాలకు వెళ్లే సింగిల్ రోడ్లకు ఆనుకుని పొలాలు ఉన్నాయి. దీనికి తోడు హరితహారం కింద రోడ్ల పక్కన మొక్కలు నాటారు. అవి ఇప్పుడు ఏపుగా పెరిగాయి. దీంతో రోడ్డు పక్కన స్థలం లేక వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

డబుల్ రోడ్లకు మోక్షం ఎప్పుడు..?

మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లె, రాంపూర్, జూపాక, కనుకులగిద్దె, ధర్మరాజుపల్లి, బొంతుపల్లి, కాట్రపల్లి తదితర గ్రామాల నుంచి వాహనాల రద్దీ తీవ్రంగా ఉంది. ఈ రోడ్లపై వాహనాలను నడుపాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. పెరిగిన వాహనాల రద్దీకి తగ్గటుగా రోడ్లను విస్తరించాలి వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లు విస్తరించాలి..

తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ జూపాక



మా ఊరి నుంచి వచ్చేటప్పుడు పెద్ద వాహనం ఎదురుగా వస్తే భయమవుతోంది. ఎక్కడో స్థలం చూసుకుని వాహనాన్ని పక్కకు ఆపి ఎదురుగా వచ్చే వాహనం వెళ్లిన తర్వాత వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళ మరీ ఇబ్బందికరంగా ఉంది. వాహనాలు పెరిగినం దున రోడ్లన్నింటిని విస్తరించాలి.


రాంపూర్-జూపాక రహదారిలో రోడ్డు ప్రమాదం (ఫైల్)

ఉదయం, సాయంత్రం వేళ రద్దీ...

ఉదయం పూట పాఠశాలలకు, కళాశాలలకు, ఉద్యోగాలకు వెళ్లే వారితో మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల నుంచి హుజూరాబాద్, జమ్మికుంట, కరీంనగర్, వరంగల్ వచ్చే రహదారులు కిట కిటలాడుతున్నాయి. దీంతో పోటాపోటీగా వాహన దారులు ఇరుకు రోడ్లపై వస్తుండడంతో ఇతరులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్కూల్, కాలేజి వ్యాన్‌లు గ్రామాల్లో వెళ్తున్న సమయంలో ఎదురుగా ట్రాక్టర్ వస్తే పక్కకు ఆపాల్సిన పరిస్థితి ఉంది. సాయంత్రం, రాత్రి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు



గోల్డ్ మెడల్ అందుకుంటున్న లక్ష్మి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌అథ్లెటిక్స్ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన మహిళాక్రీడాకారులు పతకాలను సాధించారు. ఆదివారం కేరళ రాష్ట్రం త్రిస్సూర్‌లో జాతీయస్థాయి మాస్టర్‌అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ఎం లక్ష్మి 60ప్లస్ వయస్సు విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించారు. వయస్సు 35ప్లస్‌విభాగం ఐదు కిలోమీటర్ల వాకింగ్ (నడక)పోటీలో లావణ్య బ్రాంజ్‌మెడల్ సాధించారు. జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు వన్నెతెచ్చిన క్రీడాకారులు లక్ష్మి, లావణ్యకు మాస్టర్ అథ్లెటిక్స్ రాజన్న సిరిసిల్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సంగ స్వామి, ప్రధాన కార్యదర్శి మనీందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న లావణ్య

ఒక ఊరి కథ

పల్లెను విడిచి.. పట్నం వైపు



జన సంచారం లేని రేవెల్లి రోడ్డు

- సాగును వదిలి ఉద్యోగం వైపు చూపు
- వ్యవసాయానికి దూరంగా యువత
- ఖాళీగా కనిపిస్తున్న గ్రామాలు

‘ఊళ్లె ఏముంది బిడ్డ.. ఎవుసం మేం ఎట్లనో ఒడ్డెక్కించుకుంటం.. కరీంనగర్‌కో, హైదరాబాద్‌కో పోయి ఏదో ఓ పని చూసుకో.. ఎవుసం చేసుకుంటుండంటే రేపు పిల్లను కూడా ఇయ్యరు.. ఇప్పుడు పోయి పని చేసుకునుడు మొదలువెడితే రెండు మూడేండ్ల వరకు ఎట్లనో ఒకతీరు అక్కడ తిరంగ ఉండవచ్చు.. ఏదైనా అక్కెర పడ్డప్పుడు పిలుస్తం.. వచ్చిపో’.. అంటూ గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టణాలు, నగరాల వైపు పంపిస్తున్నారు.. చొప్పదండి మండలంలోని రేవెల్లి గ్రామంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయం చేస్తారు. 90 శాతం మంది యువకులు పట్టణాలు, నగరాల్లో స్థిరపడడంతో మధ్యాహ్నం వెళితే గ్రామం మొత్తం ఖాళీగా కనిపిస్తుంది. వ్యవసాయానికి కష్టమైనా తమ పిల్లలు స్థిరపడితే చాలని వారి తల్లిదండ్రులు అంటున్నారు..

చొప్పదండి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రేవెల్లిలో రెండు వేలకుపైగా జనాభా ఉన్నారు. మూడు వందలకుపైగా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతం పరిధిలో ఉన్న ఈ గ్రామంలో సాగు భారమైపోతుంది. గ్రామానికి చెందిన యువత వ్యవసాయానికి దూరంగా ఉండి ఉపాధి కోసం పట్టణాల బాట పడుతున్నారు. వ్యవసాయంలో కష్టనష్టాలను భరించలేని పరిస్థితుల్లో చిన్న ఉద్యోగమైన పర్వాలేదంటూ పట్టణాల్లో ఉద్యోగాలను చేస్తున్నారు. ఫలితంగా వ్యవసాయం మొత్తం వృద్ధులే చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఊరంతా వ్యవసాయమే...

రేవెల్లి గ్రామంలో దాదాపు వెయ్యి ఎకరాల వరకు సాగు అవుతుండగా 90 శాతం వరి పొలాలే ఉన్నాయి. వరినాట్లు మొదలుకొని కోత పూర్తయ్యే వరకు బయటి గ్రామాల నుంచి కూలీలు వచ్చి పనులను చేసి వెళ్తున్నారు. తరచూ నష్టాలు చవిచూస్తుండడంతో యువత సాగుకు బదులుగా ఉద్యోగాలవైపు మళ్లారు. సాగు భారమంతా ఇంటి పెద్దదిక్కులే చూసుకుంటున్నారు. గతంలో గ్రామంలో ఉన్న పాలేర్ల వ్యవస్థ కూడా కనుమరుగైపోయింది. కూలీల కొరత తీవ్రంగా ఉండి పొరుగు గ్రామాలతోపాటు ఉత్తరాది కూలీల సహకారంతో సాగును చేపడుతున్నారు.



పొలంలో ఎరువులు చల్లుతున్న రైతు

ఉద్యోగం కోసం పట్టణాలకు...

సాగుకు దూరమై ఉద్యోగాల కోసం యువత పట్టణాల బాట పట్టారు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లలో స్థాయికి తగ్గట్టుగా ఉద్యోగాలను వెతుక్కొని చేస్తున్నారు. వ్యవసాయం చేస్తే కనీసం నెలకు 10 వేల రూపాయలు కూడా మిగలడం లేదని, పట్టణాలో ఏ పని చేసినా నెలకు 10 వేల నుంచి 15 వేల వరకు దొరుకుతాయని యువత చెబుతున్నారు.

స్థిరపడితే చాలని..

వ్యవసాయంలో పెట్టుబడి పెట్టి చివరికి చేతికి వచ్చిన అనేక సందర్భాల్లో నష్టపోతున్నామని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉంటే కష్టమని తల్లిదండ్రులే వారి పిల్లలను పట్టణాల వైపు పంపిస్తున్నారు. పెళ్లి కాని యువకులకు పిల్లను కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాల్లో, నగరాల్లో చిన్న పని చేసుకున్నా సంతోషంగా ఉంటారని వారు అంటున్నారు.

వ్యవసాయం కష్టమవుతోంది...
కొత్తూరి రాములు, రైతు, రేవెల్లి



నాకున్న ఐదెకరాల్లో వరి పండించడం కష్టం అవుతోంది. 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. గ్రామంలో మగ, ఆడ కూలీలు పనికి దొరకడం లేదు. పిల్లలు వ్యవసాయంకన్నా కొలువు చేయడమే మంచిదని కరీంనగర్ పోతున్నారు. ముందుముందు సాగు చేయడం చాలా కష్టమవుతుంది.

ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నా...
మావురపు భాస్కర్ రెడ్డి, రేవెల్లి



వ్యవసాయంలో గిట్టుబాటుకాక కరీంనగర్‌లో ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తున్నాను. కూలీల కొరతతోపాటు పెట్టుబడి పెరిగి ఏం మిగలడం లేదు. దీనికన్నా ఉద్యోగం చేయడమే ఉత్తమమని కరీంనగర్‌లో చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాను. వ్యవసాయంలో వచ్చే ఆదాయం కుటుంబం గడవడం కష్టం కావడంతో ఉద్యోగం చేస్తున్నాను.

సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం

- నీటికోసం ఎదురుచూసే రోజులు పోయాయి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఎల్లంపల్లి నీటికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఫాజుల్‌నగర్‌కు చెరువుకు చేరిన ఎల్లంపల్లి నీటికి నాయకులు, రైతులతో కలిసి ఆదివారం విప్ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో రైతులు రోడ్డెక్కితేనే నీటిని విడుదల చేసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు నీటికోసం ఎదురుచూసే రోజులు పోయాయని, వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు ముందుగానే నీటిని విడుదల చేశామన్నారు. శ్రీపాద ప్రాజెక్టునుంచి ఎల్లంపల్లి నీరు ఫాజుల్‌నగర్ చెరువులోకి చేరుకుందని ఇక్కడి నుంచి మల్యాల, రుద్రంగి చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఎల్లంపల్లి నీటి ద్వారా ఆయాగ్రామాల్లో చెరువులు కుంటలు నింపుతామని తెలిపారు. పడువుబడ్డ మర్రిపల్లి, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గడిచిన 13నెలల్లో 61వేలకోట్లకు పైగా రైతులకు వివిధ రూపాల్లో అందించామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ రొండి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సంఘ స్వామి, సోయినేని కరుణాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎగువ మానేరులోకి మల్లన్నసాగర్ నీరు

గంబీరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) గంబీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు జలాశయంలోకి మల్లన్నసాగర్ నీరు చేరింది. రెండు రోజుల క్రితం మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయగా, మానేరులోకి ఆదివారం సాయంత్రం వరకు అందాయి. ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం ఇటీవల సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసారు. మల్లన్నసాగర్ నీటిని మానేరులోకి విడుదల చేసి, పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. దీంతో మల్లన్నసాగర్ నుంచి రెండు రోజుల కిందట అధికారులు నీటిని విడుదల చేయగా, మానేరులోకి ఆదివారం సాయంత్రం చేరాయి. మల్లన్నసాగర్ నీటిని మానేరులోకి విడుదలకు కృషి చేసిన కేకే మహేందర్‌రెడ్డికి ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధానమంత్రిని కలవడం సంతోషంగా ఉంది

ప్రధాని ‘పరీక్షా పే చర్చ’లో పాల్గొన్న సుద్దాల విద్యార్థి అలువాల సాయితేజ



కోనరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పల్లెటూరు నుంచి ఎంపికై ప్రధానమంత్రి మోదీని కలిసి ప్రశ్నలు అడగడం సంతోషంగా ఉందని విద్యార్థి అలువాల సాయితేజ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల సాయితేజ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా జనవరి 27న ప్రధానమంత్రి మోదీని కలిసి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సాయితేజ ‘ఆంధ్రజ్యోతి’తో తన అనుభవాలను పంచుకున్నాడు. విద్యార్థి మాటల్లో.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల ఆదేశాల మేరకు జిల్లా టాలెంట్ టెస్టుల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించాను. అనంతరం గుజరాత్‌లో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్‌లో ప్రథమ స్థానం సాధించడంతో అధికారులు ప్రధాన మంత్రి మోదీ పాల్గొనే పరీక్షా పే చర్చ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఎంపిక చేశారు. ప్రతీ రాష్ట్రం నుంచి విద్యార్థులు ఒక్కొక్కరు పాల్గొనగా అందులో ప్రధానమంత్రి మోదీని ప్రశ్న అడిగే అవకాశం నాకు దక్కింది. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల సమయంలో భయానికి గురికావడం, మానసిక ఒత్తిడికిలోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని దీనికి పరిష్కారం ఏమిటని ప్రధాని మోదీని అడిగాను. మోదీ సమాధానం చెబుతూ పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పిల్లలు చదువుకునే టైములో ఎలా ఫీల్ అవుతున్నారు, వారి మానసిక పరిస్థితిని గమనించాలన్నారు. అప్పుడే విద్యార్థులు పరీక్షలు బాగా రాయగలుగుతారని ప్రధాని తెలిపారు. ప్రధానమంత్రిని కలవడానికి వచ్చిన విద్యార్థుల్లో అందరూ పట్టణ నేపథ్యం ఉన్నవారే.. నేను ఒక్కడినే పల్లెటూరు నుంచి వెళ్లాను. ప్రధానిని కలవడం సంతోషంగా ఉంది.





గుజరాత్‌లో టాలెంట్ టెస్టుల్లో భాగంగా జరిగిన ఇంటర్వ్యూలో వివిధ రాష్ట్రాల విద్యార్థులతో, ఢిల్లీలో వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సాయితేజ

వేములవాడ, కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

- రాజన్నను దర్శించుకున్న 40 వేల మంది



భక్తులతో కోలాహలంగా రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలుచేసి తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు రాజన్న దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టగా, శీఘ్ర దర్శనం క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు గంటన్నర సమయం పట్టింది. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని, గండదీపంలో నూనెపోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. రాజన్న అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి మట్టి పాత్రలో నైవేద్యం వండుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం ఆదివారం భక్తులతోసందడిగా మారింది. సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలతో తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ రాత్రివరకు కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయఅధికారులు పర్యవేక్షించారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు




కొండగట్టులో క్యూలో భక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశమివ్వండి

- పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల స్టేట్ కోఆర్డినేటర్ రాంచందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గతంలో పట్టభద్రుల, ఉపాధ్యాయల ఎమ్మెల్సీగా గెలిచిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఏనాడూ సమస్యల పరిష్కారం కోసం పోరాడింది, మాట్లాడింది లేదని, ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశమివ్వాలని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికలస్టేట్ కోఆర్డినేటర్ రాంచందర్ రావు, ఎమ్మెల్యే, శాసనసభాపక్ష ఉపనేత పాయల్‌శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని విద్యానగర్‌లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల కార్యాలయాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత అధికార కాంగ్రెస్‌పార్టీకి పెద్దగా తేడా లేదని, ఆ రెండు పార్టీలకు పట్టభద్రుల, టీచర్ల సమస్యలపై పట్టింపు లేదని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డిని, టీచర్ అభ్యర్థిగా మల్క కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య మాట్లాడుతూ సమస్యలపై తమకు అవగాహన ఉందని, త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభుభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు యాదగిరి సునీల్‌రావు, డి.శంకర్, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర అధికారప్రతినిధి సంగప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, నాయకులు కన్నబోయిన ఓదెలు, వాసాల రమేశ్, ఎర్రబెల్లి సంపత్‌రావు, వాసుదేవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, లోకేష్, ముజీబ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శాసనసభ పక్ష ఉపనేత, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎమ్మెల్సీగా గెలిచి సోనియాగాంధీకి గిఫ్ట్ ఇస్తా

- పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తాను ఎమ్మెల్సీగా గెలిచి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గిఫ్ట్‌గా ఇస్తానని ఆపార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని తనక్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ ఖరారు చేసిందని, తనకు సహకరించిన ఢిల్లీ పెద్దలకు రాష్ట్రనాయకత్వానికి రుణపడి ఉంటానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో23 రోజులే మిగిలి ఉన్నందున ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తతో మమేకమై ముందుకు సాగుతానన్నారు. ఉత్తరతెలంగాణలో కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాల మంజూరు చేసిందని మౌలిక సదుపాయాలు మాత్రం మరిచిపోయిందన్నారు. ఐదు నెలలుగా ఎమ్మెల్సీ పరిధిలోని 42నియోజక వర్గాల్లో పర్యటించినట్లు, అనేక సమస్యలు తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా ముందుంటానన్నారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కాలేజ్‌తోపాటు ప్రభుత్వఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డినరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆకారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లిమోహన్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, కాశెట్టిశ్రీనివాస్, శ్రావణ్ నాయక్, మునిగంటి అనిల్, ఫహాద్, గండి రవీందర్, వెన్నం రజితరెడ్డి, షబానా, శరణ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

మరో అవకాశమివ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా..

- ఎమ్మెల్సీ, అధ్యాపక జేఏసీ, ఉపాధ్యాయ సంఘం, పీఆర్టీయూ ఉమ్మడి అభ్యర్థి రఘోత్తంరెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): తనకు మరోసారి అవకాశమిచ్చి ఎమ్మెల్సీగా గెలిపిస్తే, అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి రఘోత్తంరెడ్డి అన్నారు. ప్రభుత్వ అధ్యాపక జేఏసీ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ పీఆర్టీయూ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తిరిగి పోటీచేస్తున్నట్లు ఆయాసంఘాలు ప్రకటించాయి. ఆదివారం నగరంలోని ఓప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడిఅభ్యర్థిగా కూర రఘోత్తంరెడ్డిని ఆమూడు సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేకసమస్యలను పరిష్కరించామన్నారు. ప్రభుత్వ అధ్యాపక జేఏసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందం, తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు పార్వతి సత్యనారాయణ మాట్లాడుతూ టీచర్ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. జూనియర్ కళాశాల అధ్యాపక జేఏసీ బాధ్యులు మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం పర్వతరెడ్డి, జి సదానందంగౌడ్, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పర్వతి సత్యనారాయణ, పాతూరి రాజిరెడ్డి, జేఎల్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుకయ్య, మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ బాధ్యులు రాజేష్ నాయక్, సత్యనారాయణగౌడ్, స్పాస్ ఫోరం అధ్యక్షుడు మండల ఆనందం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

నీటి ట్యాంకుల్లో కుంభమేళా జలాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నీటి ట్యాంకుల్లో మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఇటీవల ప్రయాగరాజ్‌లో కుంభమేళా నుంచి తీసుకువచ్చిన జలాన్ని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు అప్పగించారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ గ్రామంలోని నీటిట్యాంకుల్లో పంచాయతీ సిబ్బందితో జలాన్ని కల్పించారు. ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే ఆనీటితో స్నానం ఆచరిస్తే పుణ్యఫలం దక్కుతుందని భావించారు. కుంభమేళా జలం గ్రామంలోని నీటిట్యాంకుల్లో కలపడంపై పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీకార్యదర్శి ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా ఆయన స్పందించలేదు. ఎంపీడీవో సత్తయ్యను సంప్రదించగా కుంభమేళా జలం నీటిట్యాంకుల్లో కలిపారని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతీయకుండా నీటి ట్యాంకులను వెంటనే శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామని పేర్కొన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ట్రోఫీ కైవసం

- జిల్లా ఖోఖో జట్టును అభినందించిన ఎస్పీ



ట్రోఫీతో రాజన్న జోన్ ఖోఖో జట్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మూడో పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జోన్-111 ఖోఖో జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ఖోఖోలో తృతీయ బహుమతి గెలుచుకున్న జట్టు కెప్టెన్ అల్లం రమేశ్ (ట్రాఫిక్ ఎస్ఐ, సిరిసిల్ల) టీం సభ్యులను ఆదివారం ఎస్పీ అఖిల్ మహా జన్ అభినందించారు. టీం సమష్టి కృషితో విజయం సాధించడం స్ఫూర్తి నింపారని కొనియాడారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం శ్రీనివాస కళ్యాణ మండపంలో బీజేపీ నాయకులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులను గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండ

కోనరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ యజమాని దుర్గం మొగిలి అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబానికి ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో కోనరావుపేట ట్రాక్టర్ యూనియన్ నాయకులు భగవంతరెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చందుర్తి ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడ మైదానంలో నెహ్రూ యువకేంద్రం, జై భారత్ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్, కబడ్డీ క్రీడలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారిస్తూ, సన్మార్గంలో ప్రయాణించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్వాకులు పోంచెట్టి రాకేష్, మేడిశెట్టి శ్రీహరి, గొల్లపల్లి రాంబాబు, నక్క రవి, ఎండి రెహమాన్, నాయకులు రమేష్, గుగ్గిల్ల సాగర్, వెంగల వెంకటేష్, మేడిశెట్టి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో న్యాయమూర్తి

ధర్మపురి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆదిలాబాద్ జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.

పేదల సేవకు ప్రతీ ఒక్కరు పరితపించాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి - మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సేవ కోసం ప్రతీ ఒక్కరు పరితపించాలని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని గూడెం గ్రామంలో మెగా వైద్యశిబిరాన్ని పీపుల్స్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చింతోజు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యశిబిరంలో ఆర్థోపెడిక్, గైనాకాలజీ, లాంటి పలు వైద్య సేవలను అందించారు. ఉచితంగా వైద్య సేవలను అందించి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చింతోజు భాస్కరాచారి, పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లీలా శిరీష, డాక్టర్ తేజా, డాక్టర్ రాజారాం, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజనేయరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మానవీయ కోణంలో ముందుకు వెళ్లాలి..

మానవతా వాదులు ఆత్మ పరిశీలన చేసుకొని, మానవీయ కోణంలో ఆలోచించి ముందుకు వెళ్లాలని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్తాబాద్‌లో బిట్ల సంతోష్ మృతి చెందగా అద్దె ఇంటి యజమానులు మృతదేహాన్ని ఇంటికి రానివ్వకపోవడం మానవత్వం కాదన్నారు. సంతోష్ అంత్యక్రియలకు మానవతావాదులు ఎందరో స్పందించారన్నారు. కలెక్టర్ సైతం స్పందించి బాధిత కుటుంబానికి వెంటనే డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేశారన్నారు. కలెక్టర్‌తో పాటు అధికారులకు, చందాలు ఇచ్చిన మానవతావాదులకు కేకే కృతజ్ఞతలు తెలిపారు.

● ముస్తాబాద్‌కు చెందిన చెవుల మల్లేశ్‌యాదవ్‌కు ఇటీవల ఆపరేషన్ కాగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. బిట్ల సంతోష్ అనారోగ్యంతో మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాళ్ల బాల్‌రెడ్డి భార్య ఇటీవల మరణించగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గంభీరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ప్రాథమిక పాఠశాలలో 2002-03లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఒకే చోట చేరిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులైన పైడి రాజు, రామచంద్రం, దేవరాజు, హజు, శంకర్‌ను పూర్వ విద్యార్థులు సన్మానించారు



గురువులతో పూర్వవిద్యార్థులు

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి



రుద్రంగిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చందుర్తి,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుకలు భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తర్రె శంకరయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో హలో మాదిగ చలో హైదరాబాద్ లక్ష డబ్బులు వేల గొంతుకలు భారీ సాంస్కృతిక ప్రదర్శన ఎమ్మార్పీఎస్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దుమ్మ అంజయ్య, కొమ్ము రమేష్, బీసీ జాతీయ మండల అధ్యక్షులు అమరబండ ప్రసాద్, కోరుట్ల రమేష్, చిగుర్ల మల్లేశం, తిప్పని నర్సయ్య ఎమ్మార్పీస్ మండల ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్ మాదిగ, లింగంపల్లి బాబు మాదిగ, నాయకులు గస్కంటి ప్రభాకర్ మాదిగ, మల్యాల శ్రీనివాస్ మాదిగ, ఆవు నూరి ప్రభాకర్ మాదిగ, ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ, బిక్షపతి మాదిగ రాకేష్ మాదిగ, లింగంపల్లి బాబు, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న హైదారాబాద్‌లో నిర్వహించే లక్షల డప్పులు వేయి గొంతుల మహాకళా ప్రదర్శన పోస్టర్‌ను రుద్రంగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. వర్గీకరణ అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పినందుకు హైదారాబాద్‌లో మహాకళా ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. బహిరంగ సభకు ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ, ఉపాధ్యక్షుడు తర్రె లింగం, దయ్యాల పెద్దులు, దసారి గంగారాజం, దాసు, దయ్యాల శ్రీను, అక్కనపల్లి శ్రీను, రమేష్, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా మున్నూరు కాపు నిత్యాన్నదాన వార్షికోత్సవం

వేములవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ 2014 నుండి రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే కాపు కుల బాంధవులందరికీ సేవలందిస్తూ రాజన్న ఆశీస్సులతో విజయవంతంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సత్రం ట్రస్ట్ సభ్యులు కూరగాయల కొమురయ్య, ఖడ్గం పెంటయ్య, చింతపంటి భూమయ్య, ఈసంపల్లి వెంకన్న, కొండ కనకయ్య, నరసయ్య, మారం కుమార్, మహేష్, రాజేందర్, కొండ శేఖర్ తదితరులు ఉన్నారు.

బహుజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- బీటీఏ ఇక బీటీఎఫ్ - రాష్ట్ర అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య



మాట్లాడుతున్న కల్పదర్శి చైతన్య

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బహుజన ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన టీచర్స్ అసోసియేషన్‌ను బహుజన టీచర్స్ ఫెడరేషన్‌గా మార్పు చేశామని ఇక నుంచి బీటీఎఫ్‌గా కొనసాగుతుందని తెలిపారు. 25 సంవత్సరాల క్రితం బహుజన టీచర్స్ అసోసియేషన్‌గా తమ సంఘాన్ని ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ కోసం వెళితే ఆ సమయంలో ఫెడరేషన్ నిషేధంలో విధిలేని పరిస్థితుల్లో బీటీఏగా రిజిస్ట్రేషన్ చేసుకొని సంఘాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సంఘం రిజిస్ట్రేషన్ రెన్యూవల్‌లో బీటీఏను బీటీఎఫ్‌గా మార్చుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ఇకనుంచి బీటీఎఫ్‌గానే కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి మార్వాడి గంగారాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పట్నం చెన్నయ్య, సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కన్నం గంగయ్య, మునిగె ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మాచెట్టి లక్ష్మణ్ గుప్తా

ముస్తాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మాచెట్టి లక్ష్మణ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కూర సంతోష్, ఉపాధ్యక్షులుగా గందె చంద్రం, బండారి సత్తయ్య, ఉప్పల చంద్రం, కోశాధికారిగా కొండాపూర్ శ్రీనివాస్, మురికి వెంకటేశం, కార్యదర్శులుగా కూర నగేశ్, గరిపెల్లి రమేష్, పప్పుల శ్రీకాంత్, కోటగిరి సతీశ్, భాస్కర్, భద్రయ్య, గౌరవ సభ్యులుగా కూర భిక్షపతి, చంద విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఆర్య వైశ్య సంఘం సభ్యులు అభినందించి సన్మానం చేశారు.

ఐదు పిల్లలకు జన్మనిచ్చిన మేక

గంభీరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన మేక ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. ఒక మేక ఒక కాన్పులో ఒకటి లేదా రెండు లేదా మూడు కంటే ఎక్కువ పిల్లలకు జన్మనివ్వదు. అలాంటిది ఒకే కాన్పులో ఐదు పిల్లలకు ఓ మేక జన్మనివ్వడం ఒకింత ఆశ్చర్యం నెలకొంది. పొన్నమనేని రవీందర్‌కు చెందిన మేక మొదటి కాన్పులో ఒకటి, రెండో కాన్పులో రెండు, మూడో కాన్పులో ఏకంగా ఐదు మేక పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో ప్రజలు లక్కీ మేక అంటూ ఆ రైతు ఇంటికి వెళ్లి ఆసక్తిగా తిలకించారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పదో తరగతి విద్యార్థులు గంభీరావుపేట మండలంలోని వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా డబ్బులు పోగుచేసుకొని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాట్లు చేశారు. విద్యార్థులే స్వయంగా భోజనం వడ్డించి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సొంత డబ్బులతో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడాన్ని కరస్పాండెంట్ లతీఫ్, ప్రిన్సిపల్ శరత్‌కుమార్, డైరెక్టర్ అష్రాఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గంగపుత్ర సంఘం కమిటీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇటికల పోచయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఇటికల శ్రీనివాస్, కోశాధికారిగా ఇటికల దేవరాజ్, కార్యవర్గ సభ్యులుగా ఇటికల రాజు ఇటికల నరేందర్, అశోక్, మల్లేశం, మహేందర్, రవి, శంకర్, రమేష్, రాజనర్సు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సొంత గ్రామంలో నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అండగా నిలిచారు. కుటుంబాల పెద్దదిక్కు కోల్పోయి వివాహం చేసుకుంటున్న ఆడబిడ్డలకు రూ. 5000 చొప్పున ఆర్థిక సహాయం అందించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో రేవంత్ మిత్రమండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ మేడిపల్లి దేవానందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, కొండే రమేష్‌రెడ్డి, గరిపెల్లి రామచంద్రం, అంజన్న గౌడ్, గరుగుల కిరణ్, అఖిల్, నూకల కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

ముహూర్తాలకు వేళాయె..

(3వ పేజీ తరువాయి)

ఇతర పనులకోసం పరుగులెత్తే పరిస్థితి. ముహూర్తం రోజు దగ్గర పడితే మరీ హడావుడి ఒకప్పుడు ఉండేది. కానీ మారుతున్న కాలంతో పాటు పెళ్లి పనులు మారిపోయాయి. కూర్చున్న చోటే ఒక్క ఫోన్‌కాల్‌తో పనులన్నీ ప్యాకేజీ రూపంలో మ్యారేజ్ ప్లానర్స్ సిద్ధం చేసి పెడతారు. మన హంగామాకు తగ్గట్టుగా మ్యారేజ్ ప్లానర్స్ వివిధరకాల ప్యాకేజీలను అందిస్తున్నారు. పెళ్లికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసిపెడితే సర్వీస్ చార్జీ చెల్లిస్తే సరిపోతుంది. పెళ్లి వేడుకను నిర్వహించడానికి వచ్చిన సంస్థలు ఇప్పుడు కోట్లలోనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పెళ్లిపందిరి నుంచి భోజనాలు, ఫుడ్ స్టాల్స్, వెడ్డింగ్ కార్డ్స్, పెళ్లి ఫొటోలు, ఊరేగింపుతోపాటు పెళ్లికి కావాల్సిన బట్టలు డిజైన్ చేస్తుంటారు. నగలేకాదు అబ్బాయి అమ్మాయిలకు వేసుకోవాల్సిన నగలు, రింగ్స్, మెహందీ, చివరకు చెప్పులను కూడా వారే ఎంపిక చేస్తున్నారు. మ్యారేజ్ ప్లానర్స్ వివిధ రకాల కళాకారులను కూడా పెళ్లిలో ఉపయోగిస్తున్నారు. గతంలో పెళ్లిళ్లను కల్యాణమండపాల్లోనే నిర్వహించేవారు ఆ పరిస్థితి కూడామారి పోయింది. మైదాన ప్రాంతంలో రకరకాల సెట్టింగ్‌లను వేస్తున్నారు. పెళ్లిల్లో మహిళలు పాటలుపాడడం డ్యాన్సులు చేయడం వంటివి నిర్వహిస్తున్నారు. ఎంత వైభవంగా పెళ్లి జరిపించా లన్నా వీరు సిద్ధంగా ఉంటారు. భోజనాల విషయానికి వస్తే బాస్మతి బియ్యంతో బిర్యానీ, మటన్, చికెన్, స్వీట్‌తోపాటు వివిధ ఆహార పదార్థాలతో ప్లేట్ పూర్తిగా నిండి పోతుంది. భోజనం ముగిసిన తరువాత రకరకాల సూప్‌లు, రకరకాల చిరు తిళ్ల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఫొటో జ్ఞాపకాలకు లక్షల్లో ఖర్చు

ప్రతీ కుటుంబంలో పెళ్లి అనేది ఒక ముఖ్యమైన వేడుక ఘట్టం... అలాంటి ముఖ్య తంతును మధుర స్మృతులను భద్రపరిచేది ఫొటో ఆల్బమ్. ఇప్పుడు పెళ్లి పుస్తకంగా మన ముందుకు వచ్చింది. వెడ్డింగ్ ఫొటో గ్రఫీ ఒక ప్రత్యేకతగా నిలిచింది. ఎన్నో జ్ఞాపకాలను పెళ్లిలో చేసే సందడిని సైతం అద్భుతంగా చిత్రీకరించి ఫొటో ఆల్బమ్స్ రూపంలో అందిస్తున్నారు. కేవలం వధూవరుల పెళ్లి తతంగమే కాకుండా వేడుకకు వచ్చిన బంధుమిత్రుల బావోద్వేగాలను సైతం అందంగా చిత్రీకరిస్తున్నారు. ప్రీవెడ్డింగ్ షూట్ పేరుతో వివిధ ప్రాంతాలకు వెళ్లి వధూవరుల ఫొటోలు తీయించుకుంటున్నారు. ఒక్కపెళ్లి వేడుక ఫొటోల ఆల్బమ్‌కు లక్ష రూపాయల నుంచి రూ.3 లక్షల వరకు కూడా ఖర్చు చేస్తున్నారు.

దూరమవుతున్న ఆప్యాయతలు...

పెళ్లి స్టేటస్ సింబల్‌గా మారిపోయిన క్రమంలోనే బంధుత్వాలు కూడా దూరమైపోతున్నాయి. సమయానికి పెళ్లి వేడుకకు వచ్చి వెళ్లిపోతున్న బంధుత్వాలే కనిపిస్తున్నాయి. అక్కాచెల్లెళ్ల ఆప్యాయతలు, అన్నదమ్ముల ఆనందాలు, బావ మరదళ్ల చిలిపిమాటలు, వదిన మరదళ్ల సరదాలు, మామ, తాత, బావ, మనవడు ఇలాంటి పిలుపులే ఇప్పుడు పెళ్లిల్లో వినిపించకుండాపోతున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఆర్భాటాలు చేస్తున్నా ఆప్యాయతలను మాత్రం హృదయాల్లో నిలుపుకోలేకపోతున్నారు.

హరిప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న హరిప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్‌తో సత్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్ ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వారు చేనేత రంగంలో విశేషంగా కృషిచేస్తున్న హరిప్రసాద్‌కు డాక్టరేట్ అందించి గౌరవించారు. హరిప్రసాద్ అగ్గిపెట్టెలో అమిరే చీరలు, బంగారం, వెండితో చీర, జీ 20 లోగో మగ్గంపై నేసి ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు అందుకోవడంతో పాటు న్యూజిలాండ్ ప్రధాని ప్రశంసలు అందుకున్నందుకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక మొక్కులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిద్దె సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయంలో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మైసమ్మ ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు పెంటం పద్మయ్య, మన్నాల దేవదాసు, పెంటం మైసయ్య, మల్లయ్య, ఎల్లయ్య, ప్రవీణ్, హైదరాబాద్ సంఘం నాయకులు నాగేశ్వర్, బాలకిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డులో భారతీయ జనతాపార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. పట్టణంలోని అంబికానగర్‌లో బీజేపీ వార్డు నాయకులు వేముల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో కపిల హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది మురళి, అనంద్, శశి, నాగరాజు, సతీష్, రవి, సురేష్, సాగర్ తదితరలు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఎన్నికల జోరు

- పోటాపోటీగా నామినేషన్ల దాఖలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. పలు స్థానాలకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. అధ్యక్ష స్థానానికి నల్ల నాగిరెడ్డి, కూర అంజిరెడ్డి, గుండారపు కృష్ణారెడ్డి, ఉట్కూరి వెంకటరమణారెడ్డి, పన్యాల రాంరెడ్డి, మడపు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడి స్థానానికి ఎగుమామిడి కృష్ణారెడ్డి, డబ్బు తిరుపతిరెడ్డి, జి. ప్రసాద్‌రెడ్డి, ఎల్. కమలాకర్‌రెడ్డి, జి నర్సింహారెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, జువ్వెత్తుల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి స్థానానికి నల్ల నాగిరెడ్డి, బాణపురం రంగారెడ్డి, మద్దూరి రాంరెడ్డి, కూతురి వెంకటరెడ్డి, పన్యాల రాంరెడ్డి నామినేషన్లు దాఖలుచేశారని ఎన్నికల అధికారి పాతూరి మహేందర్‌రెడ్డి తెలిపారు.

బకాయిలు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

వీర్నపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల రైతులు విద్యుత్ బకాయిలను చెల్లించి సెస్ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో రైతులతో ఆదివారం ఆయన మాట్లాడారు. అనంతరం మండలకేంద్రంలోని కార్యాలయంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం అధ్యక్షతన సమావేశాన్ని ఏరాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో లూజ్ లైన్ల సమస్యలు తొలగిస్తామని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయానికి ఉపయోగపడే కరెంటు సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. రైతులు సహకరిస్తే సెస్ సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిరుపతి, బోయినపల్లి, ముస్తాబాద్ డైరెక్టర్లు సుధాకర్, అంజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దిడ్డి శ్రీనివాస్, అందే సుభాష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులోని జయప్రకాష్‌నగర్‌లో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్ సౌజన్యంతో మరమగ్గాల కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. వైద్యులు మరమగ్గాల కార్మికులకు వైద్యపరీక్షలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రదా రోజు బీపీ, షుగర్ పరీక్షలను చేయించుకోవాలని, మందులను క్రమం తప్పకుండా వాడాలని అన్నారు. సైకాలజిస్ట్ పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, న్యాయవాది తిరుమల, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, మాజీ కౌన్సిలర్ అడెపు చంద్రకళ, మాజీ సర్పంచ్ రాము పాల్గొన్నారు.



సిరిసిల్ల జయప్రకాష్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కేంద్ర బడ్జెట్లో గిరిజనులకు అన్యాయం



మాట్లాడుతున్న గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు

కోనరావుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో గతంలో ఎన్నడై లేని విధంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేష్ నాయక్ ఆరోపించారు. కోనరావుపేటలో విలేకరుల సమావేశంలో ఆదివారం మాట్లాడారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేపట్టిందని విమర్శించారు. మొత్తం 50,65,345 కోట్ల బడ్జెట్‌లో దేశ గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. 7 శాతం ప్రకారం గిరిజన సబ్‌ప్లాన్‌కు 3,54,574 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం 1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేసిందన్నారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ నాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలను విడదల చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4600 కోట్లు బకాయిలను విడదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడదల చేయకుండా పేద విద్యార్థుల తల్లిదండ్రులను, కళాశాల యాజమాన్యాలను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు పూర్తి చేసుకొని బయటకు వచ్చే విద్యార్థుల్లో ఫీజు బకాయిలు చెల్లించిన వారికే సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. నాయకులు ముగ్దాం అనిల్‌గౌడ్, గాజుల మహేష్, శ్రీకాంత్, మల్యాల దేవరాజు, వసీం అక్రమ్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రవిగౌడ్